క్లుప్తంగా

కార్మెల్ మాతకు భక్తులు పూజలు



ఫిరంగిపురం: స్థానిక కార్మెల్ కొండపై కొలువైన కార్మెల్ మాతను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. ఆళ్లగడ్డ, ధర్మవరం, మాచర్ల ప్రాంతాలనుండి రైళ్లు, బస్సుల ద్వారా పెద్దసంఖ్యలో వచ్చారు. కార్మెల్ మాతకు తలనీలాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

విశేష అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి



గుంటూరు రూరల్: హనుమజ్జయంతి పురస్కరించుకుని మండలంలోని ఏటుకూరు గ్రామంలో గల వీరాంజనేయస్వామి ఆలయంలో శని, ఆదివారాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు, వ్రతాలు, హోమాలు చేశారు. ప్రత్యేకంగా తమలపాకుల అర్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల సమక్షంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అన్నదాన కార్యక్రమంలో 20 వేల మందికి పైగా భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో ఉచిత కంటి వైద్య శిబిరం



గుంటూరు రూరల్: మానవ శరీరంలో కళ్లు ప్రధానమైనవని.. వాటిని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని డాక్టర్ బయ్యా శ్వేత తెలిపారు. ఆదివారం జొన్నలగడ్డ గ్రామంలోని చలమారెడ్డిపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 300 మందికిపైగా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. అర్హులైన వారికి శుక్లాల ఆపరేషన్‌లకు రిఫర్ చేశారు. కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి



మృతి చెందిన ఉదయ్‌భాస్కర్

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళాయపాలెం గ్రామానికి చెందిన సంకురాత్రిపాటి ఉదయ్‌భాస్కర్(56) నగరంలో హోంగార్డుగా పనిచేస్తుంటాడు. రోజు మాదిరిగానే శనివారం తన ఆటోలో విధులకు హాజరయ్యాడు. అనంతరం ముగించుకుని ఇంటికి వెళుతుండగా నల్లపాడు కేంద్రీయ విద్యాలయం వద్ద కుక్కను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో ఉదయ్‌భాస్కర్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇంటి పైనుంచి పడి వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: ప్రమాదవశాత్తూ ఇంటిపై నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోరంట్ల సున్నంబట్టి సెంటర్‌కు చెందిన తురుమెళ్ల నరేష్ (36) శనివారం రాత్రి వేసవి కావడంతో ఇంటిపైన నిద్రించేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ అర్ధరాత్రి పై నుంచి జారి పడ్డాడు. తీవ్రగాయాలు అవ్వడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు అతడ్ని జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుని భార్య వీరనారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బడి తెరచిన రోజే బుక్స్

- ఇప్పటికే ఎంఈవో కార్యాలయాలకు చేరుకున్న పుస్తకాలు
- 12న విద్యార్థులకు పంపిణీ
- నాడు నేడుతో మారిన ప్రభుత్వ బడుల రూపురేఖలు



కార్యాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న సిబ్బంది

మంగళగిరి: పేదలకు నాణ్యమైన విద్య అందించినప్పుడే సమ సమాజం ఏర్పడుతుందని నమ్మిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. నాడు నేడు పేరుతో పాఠశాలల రూపురేఖలు మార్చారు. గత ఐదేళ్లుగా బడి తెరచిన రోజే జగనన్న విద్యా కానుక పేరుతో పుస్తకాలు, యూనిఫామ్స్, బ్యాగ్‌లు, షూస్‌లు, బెల్ట్‌లు అందిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బంది లేకుండా చదువుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో బడి తెరచిన ఆరునెలలకు కొన్ని , ఏడాదికి మరికొన్ని పుస్తకాలు ఇచ్చి సరిపెట్టేవారు. యూనిఫారాలు, బెల్ట్‌లు, బ్యాగులు, షూస్ అన్ని బయట కొనుగోలు చేయాల్సి రావడంతో పిల్లలు అధికంగా ప్రైవేటు పాఠశాలల్ని ఆశ్రయించేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు అదనపు గదులు, మరుగుదొడ్లతో ఆధునికంగా తీర్చిదిద్దారు. సుశిక్షిత ఉపాధ్యాయుల్ని నియమించడంతో పాటు డిజిటల్ క్లాసులు, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో తల్లిదండ్రులు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. విద్యార్థులు ఏడాదికి ఏడాదికి పెరుగుతుతండగా నగరంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు మూతబడడం విశేషం.జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్దతో రోజుకో రుచికరమైన వంట నాణ్యమైన భోజనం అందిస్తుండగా ఈ ఏడాది నుంచి తాజ్ హోటల్ చెఫ్ శిక్షణ మరింత రుచికరమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

వారంలో అన్నీ రాక

ఇక మండలాల వారీగా నియోజకవర్గంలోని మూడు మండలాలకు పుస్తకాలు ఆయా మండల విద్యాశాఖ కార్యాలయాలకు చేరాయి. మంగళగిరి మండలంలో 58,902 మందికి పుస్తకాలు అవసరంకా 1, 2, 8, 9 తరగతుల విద్యార్థులకు పూర్తి స్థాయిలో మండల కార్యాలయానికి చేరాయి. తాడేపల్లి మండలంలో 35,750 పుస్తకాలు అవసరం కాగా పూర్తిగా మండల విద్యాశాఖ కార్యాలయానికి ఇప్పటికే చేరాయి. దుగ్గిరాల మండలంలో 4026 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు 22,228 , నోటు పుస్తకాలు 25,588, బెల్ట్‌లు 2,734 మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరాయి. మరో వారం రోజులలో జగనన్న విద్యా కానుకలోని పుస్తకాలు, బెల్ట్, బ్యాగ్‌లు, షూస్‌లతో విద్యార్థులకు అవసరమైన అన్నీ అందుబాటులోకి వస్తాయని ఆయా మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. బడి తెరచిన జూన్ 12న ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుకతో అన్ని అందజేస్తామని చెప్పారు.

యోగాతో ఆనందకర జీవితం



సభలో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

లక్ష్మీపురం: ఆధునిక జీవన శైలిలో ఒత్తిడిని తట్టుకుని ఆహ్లాదకరమైన జీవితాన్ని గడిపేందుకు నిత్య జీవితంలో యోగా, ధ్యానాల్ని సాధనాలుగా మార్చుకోవాలని యోగా చార్యులు, స్వామి వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు ఆళ్ల రాజేశ్వరరావు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సభలో రాజేశ్వరరావు మాట్లాడారు. యోగా, ధ్యానాలు ఆరోగ్యానికి సంబంధించినవి మాత్రమే కాదని, అవి శక్తివంతమైన జీవన మార్గాలని సూచించారు. మనసును లగ్నం చేసి క్రమం తప్పకుండా సాధన చేస్తే మనిషిని శారీరకంగా, మానసికంగా ఉన్నతస్థితికి చేరుస్తాయని తెలిపారు. శారీరక, మానసిక భావోద్వేగాల్లో సమతుల్యత, స్థిరత్వం, దృఢత్వాన్ని సాధించాలంటే యోగా, ధ్యానాల్ని ప్రతి ఒక్కరూ జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం సంస్థ సభ్యులు యోగాచార్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దేశ సంస్కృతి, కళలను పరిరక్షించాలి



అవార్డులు, ధ్రువీకరణ పత్రాలతో చిన్నారులు, కృష్ణకుమారి

నగరంపాలెం: దేశ సంస్కృతి, కళల్ని కాపాడాలని విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగిని కె.కృష్ణకుమారి అన్నారు. విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమి (హైదరాబాద్) ఆధ్వర్యంలో భాగ్యనగర బ్రహ్మోత్సవం-24, జాతీయస్థాయి డాన్స్, మ్యూజిక్ ఫెస్టివల్-7ను ఆదివారం రాత్రి రాజాగారితోట లోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. కార్యక్రమానికి అకాడమీ వ్యవస్థాపకురాలు విజయమాధవి అధ్యక్షత వహించారు. వివిధ డ్యాన్స్ అకాడమీల నుంచి వచ్చిన పలువురు నృత్యకారులు నృత్యాలతో అలరించారు. అనంతరం వంద మందికి అయోధ్య రామ మందిర్ అవార్డులు, ధ్రువీకరణ పత్రాల్ని నిర్వాహకులు, అతిథులు అందజేశారు. కార్యక్రమంలో పెయింటింగ్ ఆర్టిస్ట్ టి.రజనీరెడ్డి, సప్తరిషి మహర్షి ఆశ్రమం నిర్వాహకురాలు ఎం.విజయలక్ష్మి, పర్చూరు సబ్ రిజిస్ట్రార్ జి.కేశవరాజశేఖర్, విశ్రాంత ప్రిన్సిపాల్ పి.వి.శేషుబాబు పాల్గొన్నారు.

సివిల్స్ లక్ష్యంగా ముందుకు వెళ్లాలి



శిక్షణ పొందిన విద్యార్థులతో లక్ష్మణరావు, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు, సన్ సమన్వయకర్తలు

ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే సివిల్స్ లక్ష్యంగా ముందుకు వెళ్లాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సూచించారు. స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్, కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో 11 రోజుల పాటు జరిగిన ఐఏఎస్ ఫౌండేషన్ తరగతుల ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ సివిల్ సరీ్వసుల్లో విజయం సాధించేందుకు జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలని సూచించారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు మెంటల్ ఎబిలిటీ, జనరల్ సైన్స్, పాలిటీ, జాగ్రఫీ, ఇంగ్లీషు తదితర అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పించినట్లు చెప్పారు. కరెంట్ అఫైర్స్ కోసం ప్రతిరోజూ దినపత్రికల్ని ముఖ్యంగా ఎడిటోరియల్ పేజీల్ని చదవాలని సూచించారు. సివిల్స్ పరీక్షకు అర్హతలు, సిలబస్, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర అంశాల్ని వివరించారు. అనంతరం శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు బి. ప్రసాద్, జి. వెంకటరావు, జీవీవీ సుబ్బారాయుడు, సన్ సమన్వయకర్తలు సాయి, ఆశిష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కాంట్రాక్టు ఉద్యోగికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న బలరామ్

గుంటూరు ఈస్ట్: విద్యుదాఘాతంతో కాంట్రాక్టు ఉద్యోగికి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తల్లి విశ్రాంతమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. శివనాగరాజు కాలనీకి చెందిన గొల్లపల్లి సతీష్ తొమ్మిదేళ్లుగా విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ బలరాం వద్ద కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. గత నెల 28న కాంట్రాక్టర్ బలరాం, లైన్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి ఆదేశాలతో నల్లచెరువులో మరమ్మతుల నిమిత్తం పోలు ఎక్కాడు. ఎల్టీ లైన్ మరమ్మతులు చేస్తుండగా హైటెన్షన్ వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. సతీష్‌ను లైన్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి నగరంలోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. బిల్లు ఎక్కువ కాడంతో మరో ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. అయితే, ప్రమాదం జరిగిన నాటి నుంచి కాంట్రాక్టర్ బలరాం సెల్ స్విచ్ ఆఫ్ చేసి సతీష్ కుటుంబ సభ్యులకు అందుబాటులో లేకుండా వెళ్లిపోయాడు. అధికారులు ఘటనపై విచారణ జరిపి లైన్ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తిని సస్పెండ్ చేశారు. దీంతో సతీష్ వైద్య ఖర్చులు భరించే వారు లేకపోయారు. అతడికి ఇద్దరు పిల్లలున్నారు. కుమారుడి వైద్యానికి అధికారులు పూర్తిగా సహాయం చేయాలని ఆమె కోరుతోంది.

నగర పరిధిలో 144 సెక్షన్

ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నిచికేత్ షలేకే

పట్నంబజార్: ఎన్నికల ఫలితాలు వెలవడనున్న 4వ తేదీన నగర పరిధిలో 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నట్లు ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నిచికేత్ షలేకే తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో పోలీసు పికెట్లతో పాటు డ్రోన్ కెమెరాలతో పూర్తి నిఘా ఉంచినట్లు వివరించారు. ప్రజలు గుంపులుగా ఉండకూడదని, బయట ప్రాంతాలకు సంబంధించిన వ్యక్తులు నగర పరిధిలో ఉండకూడదని స్పష్టం చేశారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అవాంఛనీయ సంఘటనలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే దగ్గరలోని పోలీసు స్టేషన్, డయల్ 100కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ద్రాక్ష రసం పంపిణీ

తెనాలి: స్థానిక మారీసుపేట రెండు గేట్ల మధ్యన రజక వలంటరీ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో ఆదివారం ద్రాక్ష రసం పంపిణీ చేశారు. వీరవల్లి శ్రీరాములు, అనువులశెట్టి సతీష్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో 1,500 మందికి ద్రాక్ష రసం అందజేశారు. రజక వలంటీర్ సర్వీస్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్, ఫణిదపు దుర్గ, పెదలంక వెంకటేశ్వరరావు, మోపిదేవి శ్రీనివాసరావు, ఉలసి సాయి చైతన్య, త్యాగరాజు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ గణపతి సహిత హోమం



తెనాలి రూరల్: నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులు సమగ్రాభివృద్ధి సాధించాలని కోరుకుంటూ స్థానిక చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లోని నెహ్రూ నికేతన్ లిటిల్ వండర్స్ పేరుతో నూతనంగా ప్రారంభించిన శాఖలో యల్లాప్రగడ పవన్‌కుమార్ శర్మ, గొర్తి ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శ్రీలక్ష్మి గణపతి సహిత హోమం జరిపారు. నెహ్రూ నికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ పాల్గొన్నారు. 11 మంది బ్రాహ్మణ పండితులు నవ గ్రహ దానాలు, విశేష అన్న శాంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మురళీకాంత్ మాట్లాడుతూ స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న నెహ్రూనికేతన్ అమరావతి ప్లాట్స్‌లోని తమ శాఖలో నర్సరీ నుంచి 5వ తరగతి వరకు పూర్తిస్థాయి డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెహ్రూ నికేతన్ వ్యవస్థాపకులు డి.ప్రకాశరావు, రంగలక్ష్మి దంపతులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ లాసెట్‌కు స్పందన



పట్నంబజారు: ఆంధ్రప్రదేశ్ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మోడల్ లా సెట్‌కు విశేష స్పందన లభించింది. లక్ష్మీపురంలోని జుబిలేషన్ హైస్కూలులో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పల్లపు కృష్ణ ఆధ్వర్యంలో మోడల్ లాసెట్‌ను నిర్వహించారు. ఏపీపీ పల్లపు కృష్ణ మాట్లాడుతూ 2016 నుంచి లా పరీక్షలు రాసే కోసం ఉచిత మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్, అసోసియేషన్ సభ్యులు గౌస్ బాషా, సైదులు, భరత్‌రాజ్ పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజు అల్లర్లకు పాల్పడితే చర్యలు

నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్

మంగళగిరి: ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యమని, అల్లర్లకు పాల్పడకుండా ప్రజలు సహకరించాలని నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్ కోరారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ పట్టణంలో 144 సెక్షన్, యాక్ట్ 30 అమలులో ఉన్నందున ఎక్కడా ప్రజలు గుమికూడరాదని సూచించారు. విజయోత్సవాలు, బాణసంచా కాల్చడాన్ని పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామాల కూడళ్లలోని దుకాణాలకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఇప్పటికే పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చామని, వారిపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. పెట్రోలు బంకుల్లో లూజ్ విక్రయాలు చేయరాదని, ఇప్పటికే బంకుల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. మద్యం దుకాణాలను మూసి వేయడం జరుగుతుందని, ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహించేలా ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

ఆంక్షలు దాటితే కఠిన చర్యలు

తాడికొండ: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలీసు శాఖ విధించిన ఆంక్షలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని తాడికొండ సీఐ సీహెచ్. ప్రభాకర్ హెచ్చరించారు. కౌంటింగ్‌ను పురస్కరించుకొని మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిషేధించినట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో 40 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. రౌడీషీటర్లు, కేడీషీటర్లను కౌంటింగ్‌కు ముందురోజు నుంచి పోలీసు స్టేషన్‌లో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరిగితే 8688831374కు సమాచారం అందించాలని ఆయన కోరారు. మండలంలో 3 నుంచి 5వ తేదీ వరకు అన్ని దుకాణాలు మూసి వేయాలని వ్యాపారులకు సూచించారు.

పవర్ లిఫ్టర్ కుమారికి అభినందనలు



మంగళగిరి: ఏఐఎస్ఎఫ్ నాయకురాలు, న్యాయవాది పర్చూరి కుమారి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెండు పతకాలు సాధించడం అభినందనీయమని గుంటూరు పార్లమెంట్ ఇండియా కూటమి అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ కొనియాడారు. ఇటీవల పట్టణంలోని ఈద్గా మైదానంలో జరిగిన రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కుమారి రెండు రజిత పతకాలు సాధించింది. సీనియర్ మహిళల విభాగంలో 282.5 కేజీల బరువు ఎత్తి రజిత పతకం సాధించింది. బెంచ్ ప్రెస్ పోటీల్లో మరో రజిత పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోట మాల్యాద్రి, చిన్ని తిరుపతయ్య, పాన్నూరు, తాడికొండ నియోజకవర్గ నాయకులు పుప్పాల సత్యనారాయణ, ముప్పాళ్ల శివశంకర్, ఏఐటీయూసీ నాయకులు అకిటి కిరణ్‌కుమార్, రైతు సంఘం నాయకులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ పాల్గొన్నారు.

ముగిసిన హనుమత్ జయంత్యుత్సవాలు



తాళ్లూరులో విశేష అలంకారంలో స్వామి



ఫిరంగిపురంలో స్వామి

ఫిరంగిపురం: హనుమత్ జయంతిని పురస్కరించుకొని పలు గ్రామాల్లో నిర్వహించిన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. 113 తాళ్లూరులో ప్రసన్నాంజనేయస్వామికి అర్చకులు ప్రసన్నమూర్తి విశేష పూజలు నిర్వహించారు. నాగవల్లీదళాలతో అష్టోత్తర,సహస్రనామ పూజలు చేశారు. ఫిరంగిపురంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోని వీరాంజనేయుడికి అర్చకులు వెంకటాచార్యులు పంచామృతాలతో అభిషేకాలు, నాగవల్లీ దళాలతో పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రాజకీయ చైతన్యంతోనే విశ్వ బ్రాహ్మణుల ఉన్నతి



మాట్లాడుతున్న సీతారామాచార్యులు

నెహ్రూనగర్: జగత్ సృష్టికర్త విశ్వకర్మ వారసులుగా చెప్పుకుంటున్న విశ్వబ్రాహ్మణులలో సామాజిక, రాజకీయ చైతన్యం, సంఘటిత శక్తి లేనంత కాలం వర్తమాన సమాజంలో బానిసలుగానే బతకవలసి వస్తుందని సృజన కార్ పత్రిక ప్రధాన సంపాదకులు కొత్తపల్లి సీతారామాచార్యులు తెలిపారు. ఆదివారం అరండల్‌పేటలోని శ్రీ దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ చైతన్య సమావేశం నిర్వహించారు. ముందుగా భగవాన్ విశ్వకర్మ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీతారామాచార్యులు మాట్లాడుతూ పంచ వృత్తులైన వడ్రంగం, శిల్పం, బంగారం, ఇత్తడి, కమ్మరం పనుల ద్వారా నాగరిక సమాజానికి అన్ని అవసరాలను తీరుస్తున్న విశ్వబ్రాహ్మణులు అట్టడుగున ఉండిపోతున్నారని తెలిపారు. ఆధిపత్య కులాల రాజకీయాల ఆటలో దశాబ్దాలుగా ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. దీనికి విశ్వబ్రాహ్మణుల అమాయకత్వం, రాజకీయ చైతన్యం లేకపోవడమే కారణమని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, రాష్ట్రపతిగా కీర్తి గడించిన జ్ఞానీ జైల్ సింగ్ విశ్వబ్రాహ్మణుడుగా పుట్టటం వల్లే రాజకీయ ఆధిపత్య కులాలు కనీసం పార్లమెంటులో కూడా ఆయన ఫొటో కూడా పెట్టలేదని విమర్శించారు. ఆయన జయంతులు, వర్ధంతులు జరపకపోవడం విశ్వబ్రాహ్మణుల అనైక్యతకు నిదర్శనమని తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వమే విశ్వబ్రాహ్మణులలో చైతన్య దీప్తిని నింపిన పండిత గానాల రామమూర్తిని నాటి బ్రిటిష్ రాణి ప్రత్యేక పతకంతో సత్కరించడమే కాకుండా మొదటి శాసనమండలి సభ్యుడుగా గౌరవించారని గుర్తు చేశారు. తెలంగాణ సృష్టికర్త ప్రొఫెసర్ జయశంకర్, ఉద్యమ బావుటా శ్రీకాంతాచారి, మొదటి స్పీకర్ మధుసూదనాచార్యులను కేసీఆర్ రాజకీయ పావులుగానే వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ జనాభాలో నాలుగున్నర శాతం ఉన్న విశ్వబ్రాహ్మణులు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పిల్లలకు వారసత్వ సంప్రదాయాలు, చారిత్రక ఘనతను తెలియజేస్తూ వారిని చరిత్ర సృష్టించే మేధో సంపన్న సృష్టికర్తలుగా తీర్చిదిద్దాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వి.ప్రసాద్, శంకరశాస్త్రి, గోనుగుంట్ల శేషగిరిరావు, శేషగిరిరావు, కందిపి వెంకటరావు, గిరిధర్, ఏల్చూరి వీరభద్రాచారి, కె.దుర్గాప్రసాద్, జ్యోతిష సిద్ధాంతి నాగమల్లేశ్వరరావు, మేడూరి శివరామకృష్ణ, అంగలకుదుటి చంద్రశేఖరరావు, బ్రహ్మముడి కోటేశ్వరరావు, పలు విశ్వబ్రాహ్మణ సేవా సంస్థల నాయకులు పాల్గొన్నారు.

ఇండోర్ ఆటల పోటీలకు స్పందన



విద్యార్థులకు నీతి కథల బోధన



క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో గత నెల 15వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల ఇండోర్ ఆటల పోటీలను జరిపారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో చెస్, క్యారమ్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. ఆయా కథల్లోని నీతిని గురించి విద్యార్థులతో చెప్పించారు. ఈ క్రమంలో ఈ నెల 3న శతక పద్యాల పోటీని నిర్వహిస్తామన్నారు. 7న వేసవి విజ్ఞానశిబిరం ముగింపు సభలో విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందని గ్రేడ్-1 లైబ్రేరియన్ కావూరి రమాదేవి వెల్లడించారు. విద్యార్థులు ఖాళీ సమయాల్లో లైబ్రరీని సందర్శిస్తూ పుస్తక పఠనాన్ని మరింత బాగా అలవరచుకోవాలని ఆమె సూచించారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ప్రోత్సహించాలని కోరారు.